సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 28 । మార్చి । 2024



మిడ్‌మానేరులో 8 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో 8.82 టీఎంసీలకు చేరింది. ఎల్‌ఎండీకి 2,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు(సా॥)	సహర్ శుక్ర(ఉ॥)
కరీంనగర్	6.27	4.45
పెద్దపల్లి	6.34	4.51
రాజన్న సిరిసిల్ల	6.35	4.53
జగిత్యాల	6.34	4.51

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు




ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు మండలంలోని వెంకట్రావుపల్లె చెక్‌పోస్టులో పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలను బుధవారం ఎస్సై శేఖర్‌రెడ్డి పరిశీలించారు. నగదు, మద్యం, బహుమతులు వంటి వాటిని భారీగా తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రయాణ వంటి వివరాలు సైతం నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు.

సేవలే గుర్తింపునిస్తాయి



కోనరావుపేట(వేములవాడ): ఉద్యోగులకు చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం కొలనూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోడూరి ఎల్లయ్య పదవీవిరమణ చేయగా బుధవారం సన్మానించారు. హెచ్‌ఎం ఎల్లయ్య–శ్యామల దంపతులను సన్మానించారు. ఎంఈవో దూస రఘుపతి, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు కమల్‌నయన్, దివాకర్, షేక్ బాబు, ఆస్మాబేగం, రమాదేవి పాల్గొన్నారు.

భక్తులకు భద్రత కల్పించండి



వేములవాడ: రాజన్న ఆలయంలో గురువారం జరిగే కల్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చే శివపార్వతులు, జోగినులు, హిజ్రాలకు సంపూర్ణ భద్రత కల్పించాలని ఈవో కృష్ణప్రసాద్ కోరారు. బుధవారం తన చాంబర్‌లో పోలీసు అధికారులతో బందోబస్తుపై సమీక్షించారు. ఏఈవో హరికిషన్, సీఐ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య ఉన్నారు.

అర్బన్‌బ్యాంకు మహాసభ వాయిదా

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు మహాసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడింది. బుధవారం ఉదయం 11 గంటలకు అర్ధవార్షిక మహాసభను నిర్వహిస్తున్నట్లు సీఈవో పత్తిపాక శ్రీనివాస్ ప్రకటించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో వాయిదా వేసినట్లు బుధవారం ప్రకటించారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదుల ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. ఈమేరకు ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణరావు వివరాలు వెల్లడించారు. అధ్యక్ష స్థానానికి డి.సంజీవరెడ్డి, జె.శ్రీనివాసరావు, ఎస్.వసంతం, ప్రధాన కార్యదర్శిగా టి.వెంకటి, వి.గోవర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బి.నాగరాజుగౌడ్, పచ్చునూరి మధు, కోశాధికారిగా బిట్ల విష్ణు, చీకట్ల వెంకటయ్య, సాంస్కృతిక ఆటల కార్యదర్శిగా గుడ్ల కిషన్, మొగిలి రాజు, గ్రంథాలయ కార్యదర్శిగా ఎ.సురేష్ ప్రసాద్, జి.శశాంకం పోటీపడుతున్నారు. ఎన్నికలు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించి తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు.

శభాష్..పోలీస్



సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చిన ఓ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం ఏర్పడగా.. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే హోంగార్డు తిరుపతి స్పందించి రక్తదానం చేశాడు. వరదవెల్లికి చెందిన మల్లేశ్వరి సిరిసిల్ల జనరల్ ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చింది. ఏ పాజిటివ్ రక్తం అవసరం ఏర్పడగా.. పోలీస్ ఔట్‌పోస్ట్ డ్యూటీలో ఉన్న హోంగార్డు తిరుపతి రక్తదానం చేశాడు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సంతోష్, మల్లేశ్వరి కుటుంబ సభ్యులు తిరుపతిని అభినందిస్తూ..కృతజ్ఞతలు తెలిపారు.

పైసలిస్తేనే అంత్యక్రియలు

- సిరిసిల్లలో నిరుపేదలకు చావు కూడా భయానకమే..
- అంతిమసంస్కారాల ఖర్చు కనీసం రూ.25వేలు
- ఆందోళనలో నిరుపేదలు
- సమస్య పరిష్కరించాలని డిమాండ్

‘సిరిసిల్లకు చెందిన ఓ అసిస్టెంట్ స్కీం వర్కర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. ప్రభుత్వం అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందించింది. స్థానిక మున్సిపల్ వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తే రూ.15వేలకు పైగా ఖర్చు అయ్యింది. తమ దీనస్థితిని బాధిత కుటుంబం మొరపెట్టుకున్నా.. అక్కడ కనికరించే వారు లేరు.’

‘సిరిసిల్ల పట్టణ ప్రాంతానికి చెందిన ఓ రిటైర్డు ఉద్యోగి అనారోగ్యంతో మృతిచెందాడు. చికిత్స కోసం ఆస్పత్రిలోనే రూ.లక్షకు పైగా ఖర్చయ్యాయి. అదే బాధలో సొంతూరికి భౌతికకాయాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపిస్తే జబర్దస్తీగా వసూళ్లు చేశారు. అప్పుసప్పు చేసి దాదాపు రూ.20వేలు ఖర్చు చేస్తే గాని అంత్యక్రియలు పూర్తికాలేదు.’



సిరిసిల్లలో విద్యానగర్ వైకుంఠధామం

సిరిసిల్లటౌన్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో పేదలు చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడం కష్టంగా మారింది. మున్సిపల్ వైకుంఠధామాల్లోని సిబ్బంది జబర్దస్తీగా వసూళ్లు చేస్తుండడంతో బాధిత కుటుంబాలకు ఇబ్బందిగా మారింది. ఆత్మీయులను పోగొట్టుకున్న దుఃఖంలో ఉన్న వారిపై మానవత్వం చూపడం లేదు. వైకుంఠధామాలు లేని రోజులతో పోలిస్తే నేడు అంత్యక్రియల ఖర్చు నాలుగింతలు పెరగడం విమర్శలకు తావిస్తోంది.

మంట కలుస్తున్న ఆదర్శం

సిరిసిల్లలో గతంలో మానేరువాగులో అంత్యక్రియలు చేసేవారు. నిరుపేదలు ఎక్కువగా ఉండే సిరిసిల్లలో అద్దెకు ఉండేవారు చనిపోతే ఇంటి యజమానులు మృతదేహాలను ఇంట్లోకి రానీయకుండా అడ్డుకునేవారు. ఫలితంగా రోడ్డుపై శవాలను ఉంచేవారు. పోయిన వారికి ఖర్మకాండల నిర్వహణకు అనేక ఇబ్బందులు పడేవారు. ఇలాంటి సంఘటనలు 2017కు పూర్వం అనేకం. చావింట్లో నెలకొంటున్న అమానవీయ పరిస్థితులను అరికట్టేలా అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి రెండు మోడల్ గ్రే యార్డులు నిర్మించారు. ఆధునిక హంగులతో నిర్మించిన గ్రే యార్డుల్లో ఇప్పుడు సమస్యలు తిష్ట వేశాయి. అంతేకాకుండా అంత్యక్రియల నిర్వహణకు అధిక వసూళ్లు చేస్తుండడం బాధిత కుటుంబీకులపై భారంగా మారుతుంది.

సప‘రేటు’.. సమస్యలు తిష్ట

- నెహ్రూనగర్‌లో రూ.6వేలు, విద్యానగర్‌లో రూ.7,500 వసూళ్లు చేస్తున్నారు.
- వాస్తవానికి ఒకరికి అంత్యక్రియలు నిర్వహించేందుకు మున్సిపల్‌కు రూ.1,500 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.
- రెండు వైకుంఠధామాల్లో నీటివసతి సరిగా లేదు.
- ప్రతిరోజు శుభ్రం చేయడం లేదు.
- అంత్యక్రియల కార్యక్రమాలతోనే ఉపాధి పొందే వారికి ప్రభుత్వం తరఫున కనీస వేతనాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.
- కరీంనగర్ మున్సిపాలిటీ మాదిరిగా సిరిసిల్లలో కూడా అంత్యక్రియలకు ప్రత్యేక నిధులు కేటాయించాలనే డిమాండ్ ఉంది.

రూ.4.70కోట్లతో వైకుంఠధామాలు

జిల్లా కేంద్రంలోని విద్యానగర్, నెహ్రూనగర్‌లలో మోడల్ వైకుంఠధామాలను రూ.4.40కోట్లతో 2016లో నిర్మించారు. భౌతికకాయాల ఉచిత అంతిమయాత్ర కోసం రెండు వైకుంఠరథాలను ఏర్పాటు చేశారు. సంజీవయ్యనగర్‌లో రూ.10 లక్షలు వెచ్చించి మరో శ్మశానవాటికను నిర్మించారు. రగుడు ప్రాంతంలో రూ.20లక్షలతో ఎల్‌పీజీ గ్యాస్‌తో క్రిమటోరియమ్(యంత్రంతో దహన సంస్కారాలు నిర్వహించుట) ఏర్పాటు చేశారు.

అంత్యక్రియల ఖర్చు ఇలా..(రూ.లలో)	
మున్సిపల్ సుంకం	1500
కట్టెలు	4,000
డప్పులు	4,000
పాడెకట్టెలు	2,000
సుంకరి	4,000
కాటికాపరి	500
చాకలి	3,000
మంగలి	1,500
ఫ్రీజర్	4,000
మొత్తం	24,500

చాలా సార్లు ఫిర్యాదు చేశాం



దహన సంస్కారాలకు అధికంగా వసూలు చేస్తున్నారని గతంలో చాలా సార్లు ఫిర్యాదు చేశాం. నిలువ నీడలేని నిరుపేదలు చనిపోయినా అధిక వసూళ్లు ఆగడం లేదు. కరీంనగర్ స్ఫూర్తితో సిరిసిల్లలో బల్దియానే అంత్యక్రియలను ఉచితంగా జరిపించాలి.

– బియ్యంకార్ శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

అధిక వసూళ్లను నియంత్రించాలి



అంతిమసంస్కారాలలో జరుగుతున్న అధిక వసూళ్లను నియంత్రించాలి. కొద్ది రోజుల క్రితం నా భార్య చనిపోతే రూ.1,500 ఫీజు ఉందని నెహ్రూనగర్‌లో జరిపించాం. చనిపోయిన బాధలో ఉండే వారిపై మానవత్వం లేకుండా ప్రవర్తించడం సరికాదు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్యాకేజీ అమలు చేయాలి.

– చిప్ప దేవదాసు, స్థానికుడు

రూపాయి హామీ ఏమైంది ?



జనవరిలో మావార్డులో గడ్డం దేవయ్య అనే నిరుపేద చనిపోతే వైకుంఠ రథం కోసం అడిగితే డీజిల్‌కు పైసల్లేవన్నరు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్మశానవాటిక వరకు పాడెను ఎత్తుకుని పోయినం. సిరిసిల్లలో రూపాయికే దహన సంస్కారాలు నిర్వహించాలని గతంలో బీఆర్‌ఎస్ నేతలు ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయడం లేదు. గ్రే యార్డుల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

– బొల్గం నాగరాజుగౌడ్, పదోవార్డు కౌన్సిలర్

ఎన్నికల సిబ్బంది పోస్టల్ ఓట్లు వేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు ఓటు వేయలేని వారి కోసం ఫారం–12–డీలను అందుబాటులో ఉంచామని తెలిపారు. రవాణా సేవలు ,మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్ పోస్టల్ టెలిగ్రామ్ దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో–ఆపరేటివ్ సొసైటీలు ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, ఆర్టీసీ, అగ్నిమాపక సేవలు ట్రాఫిక్ పోలీస్, మొదలగు 33 అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ల సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 85 ఏళ్ల వయస్సు గల వారు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, డీఈవో రమేశ్‌కుమార్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, ఈడీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

పటిష్ట ప్రణాళికతో ఎన్నికలు

- ఎస్పీ అఖిల్‌మహాజన్
- భద్రత ఏర్పాట్లపై దిశానిర్దేశం



సమీక్షిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: పటిష్ట ప్రణాళికతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. కేంద్ర సాయుధ బలగాలతో బుధవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవన్‌లో సమావేశమయ్యారు. జిల్లాలో ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన విధులపై కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కేంద్రం సాయుధ బలగాలను క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో, రూట్ బందోబస్త్, కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని వినియోగిస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలని సూచించారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ సదన్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ అనిల్‌కుమార్, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఫిర్యాదులకు 8712656425

మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే 87126 56425 లేదా డయల్ 100లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లో అపరిచిత వ్యక్తులు పంపించే మేసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. పని ప్రదేశాల్లో వేధింపులకు గురైతే షీటీమ్‌ను సంప్రదించాలని సూచించారు.

అడ్రస్ లేనోళ్లు బండిపై విమర్శలా..

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: అడ్రస్ లేనోళ్లు బండి సంజయ్‌ని విమర్శించడం ఏంటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావును ఉద్దేశించి బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం మైనార్టీల ఓట్ల కోసమే కాంగ్రెస్ నేతలు పాకులాడుతూ.. బీజేపీ నేతలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. బండి సంజయ్, బీజేపీపై ఆరోపణలు చేసే ముందు ఉమేశ్‌రావు తమ గ్రామంలో వార్డు మెంబర్‌గా గెలిచి తన నాయకత్వాన్ని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలుస్తుందని, బండి సంజయ్ ముమ్మాటికి కరీంనగర్ ఎంపీగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కొండ నరేశ్, ఎనగంటి నరేశ్, కోడం మాధవి, బుగ్గారెడ్డి, అంజన్న, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి దిబ్బలు.. కదిలిస్తే కన్నీళ్లు



సిరిసిల్ల: పచ్చటి పంటపొలాలు.. మానేరు పరవళ్లతో ఫరిడవిల్లిన ఆ పల్లె.. నేడు శిథిలమై గతానికి సాక్ష్యంగా నిలబడింది. పశుసంపదతో అలరారిని ఆ ఊరు.. ప్రస్తుతం సగం కూలిన గోడలతో మోడుబారిపోయింది. బంధాలు.. అనుబంధాలకు వేదుకగా నిలిచిన ఆ పల్లెటూరు.. నేడు నిర్వాసితుల కన్నీటిదారలతో తడిసిపోతుంది. మిడ్‌మానేరులో నీరు తగ్గడంతో తేలిన తమ ఊరిని చూసేందుకు వచ్చి.. తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ దృశ్యాలు తంగళ్లపల్లి మండలం చీర్లవంచ పాత గ్రామంలో కనిపించాయి. ఎనిమిదేళ్ల కిందట మిడ్ మానేరులో మునిగిపోగా.. నీరు తగ్గడంతో నేడు తేలి.. శిథిల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. 8లో▸

పోచమ్మతల్లికి ‘ఆది’ మొక్కులు



చందుర్తి(వేములవాడ): వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో మండలంలోని మర్రిగడ్డ, కట్టలింగంపేట గ్రామస్తులు బుధవారం పోచమ్మతల్లికి మొక్కులు చెల్లించారు. రెడ్డిజన సంఘానికి చెందిన 120 కుటుంబాలు, కట్టలింగంపేటలో గ్రామస్తులు అందరూ బోనాలు తీశారు. మర్రిగడ్డలో పోచమ్మతల్లిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రారంభోత్సవ పూజలో పాల్గొన్న ఈవో కృష్ణప్రసాద్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, అర్చకులు



కల్యాణోత్సవం తిలకించేందుకు బుధవారం రాత్రికే వేములవాడకు చేరుకున్న భక్తులు

కల్యాణం చూద్దాం రారండి

- నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం
- రాజన్న ఆలయంలో ఆరంభమైన ఉత్సవాలు



వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాలు బుధవారం ఘనంగా ఆరంభమయ్యాయి. ఉదయం 7.33 గంటలకు ఈవో కృష్ణప్రసాద్ ఉత్సవాలను ప్రారంభించారు. మేళతాళాలతో స్వామి వారి ఉత్సవమూర్తులను ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకొని అర్చకులకు దేవస్థానం తరఫున వర్ని–దీక్షావస్త్రాలు అందజేశారు. అనంతరం వివిధ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ సారథ్యంలో భేరీపూజ, దేవత ఆహ్వానం, నీరాజనం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

నేడు పార్వతీరాజరాజేశ్వరుల పెళ్లి

రాజన్న ఆలయంలో గురువారం ఉదయం 10.50 గంటలకు పార్వతీరాజరాజేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం ఎదుర్కోళ్ల అనంతరం 10.50 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు పెద్దసేవపై ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు

రాజన్న పెళ్లికి స్థానిక మున్సిపాలిటీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు కమిషనర్ అన్వేశ్ బుధవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యాలయం నుంచి ఊరేగింపుగా రాజన్న ఆలయానికి చేరుకుని స్వామి వారికి సమర్పిస్తామన్నారు.

నేతన్నలకు జౌళిశాఖ గుర్తింపుకార్డులు



జౌళిశాఖ జారీచేసిన గుర్తింపుకార్డు

సిరిసిల్ల: నేతకార్మికులకు చేనేత, జౌళిశాఖ గుర్తింపు కార్డులను జారీ చేస్తుంది. టీ–నేతన్న యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్న వారికి జౌళిశాఖ ద్వారా గుర్తింపుకార్డులు వస్తున్నాయి. ఇందులో కార్మికుడి ఫొటో, పేరు, గుర్తింపుకార్డు నంబరు, మొబైల్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, అడ్రస్‌తో కూడిన వివరాలను పొందుపరిచారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన టీ–నేతన్న యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్న కార్మికులు, ఆసాములకు గుర్తింపుకార్డులు మీసేవ కేంద్రాల ద్వారా అందుతున్నాయి. ఈ కార్డు ఉన్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందుతాయని జౌళిశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల వివరాల సమాచారం ఎస్ఎంఎస్ ద్వారా నేరుగా నేతకార్మికులకు చేరుతాయని భావిస్తున్నారు. ఇంకా టీ–నేతన్న యాప్‌లో నమోదు కాని నేతకార్మికులు, ఆసాములు, అనుబంధ రంగాల కార్మికులు ఉంటే నమోదు చేసుకోవాలని జౌళిశాఖ అధికారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి

మల్లాపూర్: తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతిచెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పుట్ట ధర్మయ్య (35)కు భార్య పోశాని, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణకు గ్రామంలో పశువులకాపరిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం పశువులతో గ్రామశివారులోకి వెళ్లిన ధర్మయ్యపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో ధర్మయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. ధర్మయ్య భార్య పోశాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): వెన్నంపల్లి గ్రామానికి చెందిన వెల్తూరి మణెమ్మ(49) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మణెమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి తీవ్రం కావడంతో భరించలేక సోమవారం రాత్రి పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పెద్దపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంగనర్ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలికి భర్త సుదర్శన్, కుమారుడు ఉపేందర్ ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

బుడగజంగం కాలనీలో..

హుజూరాబాద్‌రూరల్: బుడగజంగం కాలనీకి చెందిన ఓ చిన్నారి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... కాలనీకి చెందిన మోటం కనకయ్య కూతురు రిషిత(ఏడాదిన్నర వయస్సు) ఈ నెల 25న సాయంత్రం ఆడుకుంటూ పక్క ఇంటికి వెళ్లింది. ఆ ఇంట్లోని పొయ్యి మీద పెట్టిన డికాషన్ ప్రమాదవశాత్తు చిన్నారి మీద పడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది

తలపులతండాలో మహిళ..

సారంగాపూర్: మండలంలోని మ్యాడారంతండా పంచాయతీ పరిధి తలుపులతండాకు చెందిన మోతె నర్సవ్వ (49)చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం నర్సవ్వకు చాలా రోజులుగా మానసిక స్థితి సరిగాలేదు. ఈనెల 17న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన ఆమె భర్త పోశం ఆమెను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితంలేదు. నర్సవ్వకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థి శవం లభ్యం


అభిలాష్ (ఫైల్)

తిమ్మాపూర్: జిల్లాలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యం కాగా.. బుధవారం బావిలో శవమై కనిపించాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన అభిలాశ్ (20) ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతూ సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 2 నుంచి కనిపించడం లేదని తండ్రి శ్రీనివాస్ ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించారు. బుధవారం మహాత్మనగర్ శివారులోని గవ్వ రవీందర్ రెడ్డి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. కరీంనగర్ ఆస్పత్రి వైద్యులు అక్కడే శవపరీక్ష చేశారు. కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయనే తండ్రి ఫిర్యాదుతో ఆ కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై చేరాలు వివరించారు.

25వ వర్ధంతి



DOB: 12-10-1956

DOD: 28-03-1999

కీ॥శే॥ Dr. M. సునీల్ సాయినాథ్ రెడ్డి గారు

MS Surgery (AIIMS)

సిక్ బే హాస్పిటల్స్ వ్యవస్థాపకులు. గోదావరిఖని మరియు హైదరాబాద్.

మీ మంచితనం, వైద్యసేవ మరియు ఆప్యాయత మాకు ఎల్లప్పుడూ ఆదర్శం, మీ జ్ఞాపకాలు మా హృదయంలో చిరస్మరణీయం.

భార్య : Dr. S. సులోచన (DGO)

కుమారుడు : సుశీతల్ ముమ్మడి,

కూతురు : Dr. సుదీప్తి ముమ్మడి, (MBBS, MS)

సాయినాథ్ హాస్పిటల్

(గతంలో సిక్ బే హాస్పిటల్స్),

8-3-214/46, శ్రీనివాస నగర్ కాలనీ (W), అమీర్‌పేట్, హైదరాబాద్, Ph: 9966774477

మట్టి దిబ్బలు.. కదిలిస్తే కన్నీళ్లు

- ఈ శిథిలాలు.. నాటి పల్లె ఆనవాళ్లు
- మధ్యమానేరులో మునిగి.. తేలిన చీర్లవంచ
- వచ్చి చూసి వెళ్తున్న నిర్వాసితులు
- జ్ఞాపకాలతో బరువెక్కుతున్న గుండెలు

సిరిసిల్ల: చుట్టూ పచ్చటి పొలాలు.. ఏపుగా పెరిగిన మామిడితోటలు.. మానేరువాగు జలసవ్వడులు.. ఇది ఆనాటి పల్లెముఖచిత్రం. ఆవులు.. బర్రెలు... గొర్రెలు.. సబ్బండ వర్ణాల పల్లె అది. గ్రామపంచాయతీ ఆఫీసు.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. వేణుగోపాలస్వామి ఆలయం.. ఊరికి దూరంగా శివాలయం.. నడి ఊరిలో ఈద్గా.. బడి.. గుడితో ఉండే ఆ పల్లె నేడు మట్టిదిబ్బలతో కళావిహీనంగా కనిపిస్తుంది. మిడ్‌మానేరులో నీరు తగ్గడంతో తేలిన ఆనాటి పల్లెను చూసేందుకు వచ్చిన నిర్వాసితులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఒకప్పుడు పాడిపంటలతో కళకళలాడిన తమ ఊరు నేడు మట్టిదిబ్బల మయం కావడాన్ని చూస్తూ ఆనాటి ఆనవాళ్లను గుర్తు చేసుకుంటున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ ఊరు మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం) ప్రాజెక్టులో ఎనిమిదేళ్ల కిందట మునిగిపోయింది. జలసమాధి అయిన ఆ పల్లె ఇప్పుడు జలాశయంలో నీరు తగ్గడంతో తేలింది. ఇళ్లు శిథిలమై.. బస్టాండ్.. గుడి ఆనవాళ్లు గుర్తుపట్టలేనంతగా మారిపోయి దర్శనమిస్తున్నాయి. పది వేల జనాభా ఉండే ఆ పల్లెను 'సాక్షి' బుధవారం సందర్శించింది.

చెదిరి'పోయిన' పక్షులు

చీర్లవంచ గ్రామం మధ్యమానేరులో మునిగిపోవడంతో గ్రామీణులు చెల్లాచెదురయ్యారు. కొందరు వేములవాడ శివారులోని చంద్రగిరి పునరావాస కాలనీకి వెళ్లగా.. మరికొందరు సమీపంలోని గుట్టల వద్దకు చేరారు. అనేక మంది కరీంనగర్, హైదరాబాద్ బాట పట్టారు. ఇలా గూడు చెదిరిన పక్షుల్లా ఊరు విడిచిన నిర్వాసితులు ఇప్పుడు చీర్లవంచ తేలిందని తెలిసి ఆ శిథిలాలను చూసేందుకు వస్తున్నారు. కూలిన గోడల మధ్య నాటి ఆనవాళ్లను వెతుక్కుంటున్నారు. 'అగో మన గ్రామపంచాయతీ భవనం.. ఇక్కడే సర్పంచ్ జెండా ఎత్తేవాడు.. ఇది


నేడు: చీర్లవంచ-వల్లంపట్ల రోడ్డు.

బస్‌షెల్టర్.. అరేయ్ ఇది మన వేణుగోపాలస్వామి గుడి.. అదిగో ఈద్గా ..' అంటూ.. పుట్టిపెరిగిన ఊరు జాడలను వెతుక్కుంటున్నారు. ఊరు విడిచి వెళ్లి.. చెట్టుకొకరం.. పుట్టకొకరం అయితిమి.. అంటూ... నాటి బాల్యమిత్రులను కలిసి చిన్ననాటి ఊసులు పంచుకుంటున్నారు. మధ్యమానేరు జలాశయంలో 26 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా.. ఇప్పుడు 9 టీఎంసీలకు చేరింది. ఫలితంగా ఎనిమిదేళ్ల తర్వాత ఒక్క చీర్లవంచ ఊరే కాదు.. మధ్యమానేరులో పూర్తిగా మునిగిన చింతలఠాణా, రుద్రవరం, కొడిముంజ, నీలోజిపల్లె, శాభాష్‌పల్లి, అనుపురం గ్రామాలు తేలాయి. ఆయా గ్రామాల్లో సుమారు 15వేల ఇళ్లు శిథిలమయ్యాయి. ఇప్పుడు తమ ఆనవాళ్లు వెతుక్కుంటూ.. నిర్వాసితులు కన్నీరు పెడుతున్నారు. ఊరిలోని వీధులు.. అక్కడ జరిగిన నాటి సంగతులను గుర్తు చేసుకుంటూ.. బరువెక్కిన గుండెలతో ఆ ఊరును వీడుతున్నారు.

మళ్లీ నిండడం గగనమే..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మధ్యమానేరు జలాశయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. శ్రీరాంసాగర్ వరదకాల్వ ద్వారా నీరు మధ్యమానేరుకు చేరుతుండగా.. మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ నిండడం అసాధ్యంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో గోదావరి జలాలను ఎత్తిపోయడం కష్టమేననే చర్చ సాగుతుంది. ఫలితంగా మధ్యమానేరు మళ్లీ జలకళ రావడం కష్టమేనని భావిస్తున్నారు. వర్షాలు బాగా పడితే.. ఎగువమానేరు పొంగితే.. మధ్యమానేరు నిండే అవకాశం ఉంది. ఏది ఏమైనా.. ముంపు గ్రామాలు తేలడంతో తమ నివాసాలను చూస్తూ.. నిర్వాసితుల గుండెలు బరువెక్కుతున్నాయి.


చీర్లవంచ నాటి గ్రామపంచాయతీ ఆఫీస్ భవనం


చీర్లవంచలోని ఈద్గా


నేడు: చీర్లవంచ బస్టాండు


నాడు: చీర్లవంచ బస్టాండు..(ఫైల్)

కరీంనగర్‌లో స్థిరపడ్డాను..



మాకు చీర్లవంచలో ఐదెకరాల భూమి ఉండేది. జలాశయంలో ముంపునకు గురైంది. అరకొర పరిహారంతో కరీంనగర్‌లో స్థిరపడ్డాం. ఇటీవల మళ్లీ చీర్లవంచ పునరావాస కాలనీలో స్థలం కొన్నాను. ఇక్కడే ఇల్లు కట్టుకుని స్థిరపడాలని భావిస్తున్నాను. మా ఊరిని చూస్తే చాలా బాధగా ఉంది. మట్టిదిబ్బలే కనిపిస్తున్నాయి.

– ఉమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి, కరీంనగర్, నిర్వాసితుడు

చాలా మంది వచ్చి చూసిపోతుండ్రు



ఊరు తేలిందని తెలిసి చాలా మంది వచ్చి చూసిపోతుండ్రు. ఊరు మునిగిపోవడంతో ఇక్కడి నుంచి వెళ్లి ఎక్కడెక్కడో స్థిరపడిన వారు మళ్లీ చీర్లవంచ పాత ఊరికి వచ్చి తమ ఇళ్లను చూసి ఆవేదన చెందుతున్నారు. నేను ఊరి మీద ఉన్న మమకారంతో ఇక్కడే పునరావాసకాలనీలో ఇల్లు కట్టుకుని, ఉన్న కొద్ది పాటి భూమిలో వ్యవసాయ చేస్తూ.. ఇక్కడే ఉన్నాను. మా ఇళ్లను చూస్తే.. దుఃఖం వస్తుంది.

– వంగపల్లి అనంతరెడ్డి, చీర్లవంచ నిర్వాసితుడు

అన్నింటికీ తిప్పలే..



ఊరు మునిగి అన్నింటికీ తిప్పలే అయితుంది. ఊరు ఉన్నప్పుడు ఎంతో బాగుండే. అందరం కలిసి పనిచేసుకుంటూ.. ఎంతో సంతోషంగా ఉండేది. పండగలు, పబ్బాలకు అందరూ వచ్చి కలిసేవాళ్లం. ఇప్పుడు ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియని బాధ ఉంది. ఊరిలోనే ఎంతో పని దొరికేది. ఇప్పుడు చేద్దామంటే పని లేని పరిస్థితి ఎదురైంది. చీర్లవంచ అంటే.. ఒకప్పుడు చాలా పెద్ద ఊరు. ఇప్పుడు కుక్కలు చింపిన విస్తరి అయింది.

– మచ్చ మల్లయ్య, చీర్లవంచ నిర్వాసితుడు

పచ్చని సంసారంలో మద్యం చిచ్చు

- తాగిన మైకంలో భార్యపై రాడ్‌తో దాడి
- అక్కడికక్కడే చనిపోయిన భార్య
- అనాథగా మారిన ఒక్కగానొక్క కూతురు


రజిత మృతదేహం పక్కన రోదిస్తున్న బంధువు

వెల్గటూర్ : మద్యం మత్తు ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఓ వ్యక్తి కట్టుకున్న భార్యను రాడ్‌తో కొట్టి చంపిన సంఘటన ఎండపల్లి మండలం మారేడుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మారేడుపల్లికి చెందిన వ్యాళ్ల పున్నంరెడ్డికి ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రజితతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు అక్షిత రెడ్డి(11) జన్మించింది. కొద్దిరోజులుగా పున్నంరెడ్డి మద్యానికి బానిసయ్యాడు. అప్పటినుంచి భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అతిగా మద్యం సేవించిన పున్నంరెడ్డి అర్ధరాత్రి సమయంలో భార్య రజితతో గొడవ పడ్డాడు. మాటామాటా పెరగడంతో రజిత(38)ను ఇనుపరాడ్‌తో బలంగా కొట్టడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. రజిత మృతదేహాన్ని చూసి బంధువులు గుండెలవిసేలా రోదించారు. రజితకు కూతురు అక్షిత రెడ్డి తలకొరివి పెట్టింది. రజిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి రజిత కాటికి.. తండ్రి జైలుకు వెళ్లడంతో వారి కూతురు అనాథగా మారింది.

జల్సాలకు అడ్డుపడుతోందనే భార్య హత్య

- కేసులో భర్త అరెస్టు : ఏసీపీ గజ్జి కృష్ణ


మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిరూరల్: మద్యానికి బానిస అయిన భర్త.. జల్సాలకు అడ్డుపడుతూ నిత్యం గొడవకు దిగుతోందని భావించి కట్టుకున్న భార్య వ్యాళ్ల రజితను భర్త వ్యాళ్ల పున్నంరెడ్డి కడతేర్చాడని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారెడుపల్లిలో జరిగిన సంఘటన వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయోధ్య రామమందిర దర్శనానికి వెళ్లొచ్చి మద్యం తాగడం మానేసిన పున్నంరెడ్డి.. మంగళవారం మళ్లీ మద్యం తాగడాన్ని భార్య రజిత ప్రశ్నించింది. మద్యం తాగినప్పుడల్లా భార్యతో గొడవ పడాల్సి వస్తోందని, జల్సాలకు ఆమె అడ్డుగా ఉందని భావించిన పున్నంరెడ్డి.. ఇనుప చైన్‌పానతో రజితతలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. తల్లి వజ్రవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పున్నంరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ కృష్ణ, బసంత్‌నగర్ ఎస్సై స్వామి పాల్గొన్నారు.

పరువు పోతుందని యువకుడి ఆత్మహత్య


రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ తీగల వంతెన వద్ద సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి (28) బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు ఓ యువతి కారణమంటూ సూసైడ్ నోట్ రాశాడు. ఆరేళ్లుగా కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డికి ఇటీవల పెళ్లి సంబంధం చూశామని తండ్రి దూది రఘుపతిరెడ్డి తెలిపారు. అయితే అదే హోటల్‌లో పనిచేస్తున్న ఓ యువతి బ్లాక్ మెయిల్ చేస్తూ తన కుమారుడిని పెళ్లి చేసుకోకుండా అడ్డుకునే ప్రయత్నం చేసిందన్నారు. ఈ నెల 23న నలుగురు వ్యక్తులతో కలిసి మల్లాపూర్ గ్రామానికి వచ్చి పరువు తీసిందని ఆరోపించారు. మళ్లీ గ్రామానికి వస్తానని బెదిరించడంతో పరువు పోతుందనే భయంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పురుగుల మందు తాగిన ప్రభుత్వ ఉద్యోగి

- సకాలంలో ఆస్పత్రిలో చేర్పించిన కానిస్టేబుల్


ఆత్మహత్యకు యత్నించిన మణికుమార్ వద్ద కానిస్టేబుల్ జుబేర్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి పురుగుల మందుతాగాడు. ఆ వెంటనే 100కు డయల్ చేశాడు. స్పందించిన బ్లూకోల్ట్స్ సిబ్బంది అతడిని సకాలంలో ఆసుపత్రిలో చేరించారు. ములుగు జిల్లా వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మణికుమార్ భార్య జగిత్యాలలోని ఓ ప్రభుత్వ శాఖలో పనిచేస్తోంది. ఇటీవల ఇద్దరి మధ్య తరుచూ గొడవలు కావడంతో మణికుమార్ జగిత్యాలకు వచ్చాడు. బుధవారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురై గొల్లపల్లి రోడ్‌లోని తిమ్మాపూర్ చౌరస్తా వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే 100కు డయల్ చేయడంతో వారు బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో కానిస్టేబుల్ జుబేర్ సత్వరమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని మణికుమార్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సత్వరమే స్పందించిన జుబేర్‌ను స్థానికులు అభినందించారు.

లెజియన్ ఫాకో మెషిన్ ప్రారంభం


కంటి పరీక్ష చేసుకుంటున్న చిన జీయర్ స్వామి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రిలో రూ.37 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన లెజియన్ ఫాకో మెషిన్‌ను చిన జీయర్ స్వామి బుధవారం ప్రారంభించారు. దీని ద్వారా అతి చిన్న గాటుతో కేటరాక్ట్ ఆపరేషన్లు చేయవచ్చని వైద్యులు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించిన చిన జీయర్ స్వామి రోగులను పరామర్శించారు. ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులు, వైద్యులకు మంగళశాసనాలు అందజేశారు. ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, కోశాధికారి బొమ్మ పవన్, ట్రస్ట్ సభ్యులు మురళీధర్ రావు, కోల అన్నారెడ్డి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కోదండరాములు, మోర బద్రేశం, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

కరీంనగర్‌క్రైం: నగరంలోని పలు ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన బొజ్జ మనోజ్‌కుమార్ ప్రస్తుతం కరీంనగర్‌లోని నగునూర్‌లో నివాసముంటూ వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులైన హైదరాబాద్ బోయినపల్లికి చెందిన బండెల సుమిత్, విజయవాడకు చెందిన యెల్ల సత్యఆంజనేయులుతో పాటు ఒక మైనర్ బాలుడు జల్సాలకు అలవాటుపడి, చేసే పని ద్వారా పొందే డబ్బు సరిపోక, బృందంగా ఏర్పడ్డారు. కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో 4 బైక్‌లు దొంగలించారు. వాటిలో ఒకటి హైదరాబాద్ తరలించారు. మిగిలినవాటిని కూడా అక్కడే విక్రయించి డబ్బు పొందాలని ప్రయత్నించిన నలుగురిని కరీంనగర్ రూరల్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురిపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు.

మామిడి తోటలపై వానరాల దాడి


నేలరాలిన మామిడి కాయలు

హుజూరాబాద్‌రూరల్: మామిడితోటలపై వానరాలు మూకుమ్మడి దాడి చేస్తుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించడంతో మండలంలోని ఆయా గ్రామాల్లోని మామిడితోటలకు అధిక పూత వచ్చినప్పటికీ కోతులు తోటలను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. పదుల సంఖ్యలో కాయలను కొరికి నేలపాలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడితోటలే కాకుండా, పెరటి తోటలు, పూలమొక్కలు, కిచెన్ గార్డెన్‌లను ధ్వంసం చేస్తున్నాయని, ఇండ్లలోకి చొరబడి విధ్వంసం సృష్టిస్తున్నాయని. సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

'యశోద'లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్


మాట్లాడుతున్న డాక్టర్ గణేశ్ జైషెత్వార్

కరీంనగర్‌టౌన్: బ్లడ్ కేన్సర్‌కు సంబంధించి యశోద ఆస్పత్రి హైటెక్‌సిటీలో అత్యాధునిక పద్ధతిలో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తున్నట్లు ఆస్పత్రి హెమటాలజిస్టు, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్టు డాక్టర్ గణేశ్ జైషెత్వార్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని యశోద మెడికల్ సెంటర్‌లో బ్లడ్ కేన్సర్, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్వైవర్స్‌పై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లడ్ కేన్సర్ వచ్చిన వారికి బ్లడ్ ఉత్పత్తి తగ్గిపోతుందని, ఫలితంగా 6 నెలలకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. ఇది ఏ వయసు వారికైనా లింగభేదం లేకుండా వస్తుందని, మన దేశంలో ఏడాదికి లక్ష జనాభాకు 5.5 కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతీ 20 సెకన్లకు ఒకరు బ్లడ్ కేన్సర్‌తో మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాధి రావడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. జిల్లాకు చెందిన మురళి అనే వ్యాపారి బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతుండగా అతని సోదరి నుంచి స్టెమ్‌సెల్ సేకరించి, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసినట్లు తెలిపారు. అలాగే, 13 ఏళ్ల బాలికకు ఆమె తల్లి నుంచి స్టెమ్‌సెల్ సేకరించి, చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, సాధారణ జీవితం గడుపుతున్నారని అన్నారు. బ్లడ్ కేన్సర్ వచ్చిందని భయపడాల్సిన పనిలేదని, యశోద ఆస్పత్రి హైటెక్‌సిటీ బ్రాంచిలో అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు.

'జ్యోతిష్మతి'లో ఇన్నోఫెస్ట్


ఎక్స్‌పోను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ కామాక్షి ప్రసాద్, జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్ రావు

తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ఇన్నోఫెస్ట్– 2024 బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జగిత్యాల జిల్లా నాచుపల్లి జేఎన్టీయూ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కామాక్షి ప్రసాద్, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు హాజరయ్యారు. కాంపిటేషన్స్, కోడింగ్ ,పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ట్రెజర్ హంట్ జరుగుతాయని వారు తెలిపారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో ప్రతిభకనబర్చిన వారికి మొదటి బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 3 వేలు, పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ. 2 వేలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్, సెక్రటరీ జువ్వాడి సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్ డాక్టర్ వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి.సంపత్ రావు, కోఆర్డినేటర్స్ ఆర్.జగదీషన్, మణికంఠ, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

కథలాపూర్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన బంటు నారాయణతోపాటు మాణిక్యం, భారతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన బంటు లావణ్యను అదనపు కట్నం తీసుకురావాలని ఆమె భర్త నారాయణతోపాటు బావ, ఆడబిడ్డ వేధింపులకు గురిచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

అదనపుకట్నం కేసు

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడుతున్నవారిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. పట్టణానికి చెందిన జ్యోతిని బీమదేవరపల్లి మండలం మాణిక్యపూర్ గ్రామానికి చెందిన ఒల్లాల తిరుపతితో ఐదేళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరికి ఒకపాప, పెళ్లిలో రూ.మూడులక్షల కట్నం, మూడు తులాల బంగారం, ఇతర లాంచనాలు అందజేశారు. నెలరోజులుగా మద్యం సేవించి, అదనపు కట్నం తీసుకురావాలని భర్త మహేందర్, మామ తిరుపతి వేధిస్తున్నారని, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఆరుగురికి కరీంనగర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. పట్టణంలో మద్యం తాగి, వాహనాలు నడుపుతూ 18 మంది పట్టుబడ్డారని అన్నారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి జైలుశిక్ష, మిగతా వారికి జరిమానా వేశారని పేర్కొన్నారు.

బైక్‌లు ఢీకొని కార్మికుడి మృతి

పెద్దపల్లిరూరల్: అందుగులపల్లి వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పుట్ట మల్లయ్య(58) అనే కార్మికుడు మరణించాడు. బసంత్‌నగర్ సిమెంట్ కర్మాగారంలో పనిచేసే పుట్ట మల్లయ్య.. తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. వెంటనే స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిపదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G.1454]

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T.1252718]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:

9951602933

9951602824

క్లుప్తంగా

నేడు సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన



సిరిసిల్ల: సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ గురువారం సిరిసిల్లలో పర్యటించనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని గన్నెవారిపల్లెలో ఇటీవల వడగళ్ల వానలతో నష్టపోయిన రైతుల పంటలను పరిశీలిస్తారన్నారు. ముస్తాబాద్ మండలకేంద్రంలో విద్యుత్ స్తంభం విరిగిపడి మృతిచెందిన ఎల్సాని ఎల్లయ్య కుటుంబాన్ని రవి అనే హోటల్ యజమాని కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ కుమారుడి వివాహ వేడుకకు హాజరవుతారు. సిరిసిల్లలోని షాదీఖానలో నిర్వహించే ఇఫ్తార్ విందులో కేటీఆర్ పాల్గొంటారని మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏప్రిల్ 1న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మీ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, స్పందన ఫైనాన్స్ కంపెనీలతో పాటు మెడ్‌ప్లస్, అమెజాన్ వంటి కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 2018నుంచి 2023వరకు డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు, ఈ ఏడాది తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలకు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాలుగు సెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9491598584, 85008 25230లో సంప్రదించాలని కోరారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన



ర్యాలీ తీస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనలో ముందుగా వ్యాధి లక్షణాలను గుర్తించి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, లెక్చరర్లు రవళి, స్వాతి, స్వర్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

ముస్తాబాద్: మండలంలోని మొర్రాపూర్ తండాలోని చెరువు శిఖం భూమిలో బావి తవ్వకంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నీటిపారుదలశాఖ ఏఈ వంశీకృష్ణ బుధవారం తెలిపారు. గ్రామస్తుల సమాచారంతో క్షేత్రస్థాయిలో చెరువు శిఖం భూములను పరిశీలించామని, బావి తవ్వకానికి కారణమైన వారిపై చర్యలకు ఎస్సైకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణం



వీర్నపల్లి: మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ముదిరాజ్‌లు వైభవంగా నిర్వహించారు. పెద్దమ్మ జాతరలో భాగంగా ఆలయంలో పెద్దమ్మ-పెద్దిరాజులకు పట్నాలు వేసి కల్యాణం జరిపించారు. డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో ఆవరణలో ఒగ్గు కళాకారులు కథను వివరించారు. భక్తుల పెద్దసంఖ్యలో తరలిరాగా అన్నదానం నిర్వహించారు. ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



రుద్రంగి: మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయితీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేలు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ముదాం సతీశ్, ప్రధాన కార్యదర్శిగా గంగుల ప్రశాంత్, కోశాధికారిగా మారుపాక సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీవో సుధాకర్ ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ధ్రువపత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కల రక్షణే లక్ష్యంగా..

- మండలంలో 24 నర్సరీలు
- మొక్కల సంరక్షణకు ఇప్పటికే 18 నర్సరీల్లో షెడ్‌నెట్‌లు ఏర్పాటు
- 2.5లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యం

మండలంలో నర్సరీల వివరాలు

నర్సరీల సంఖ్య	- 24
షెడ్‌నెట్స్ ఉన్నవి	- 18
పెంచుతున్న మొక్కలు	- 2.5లక్షలు
రక్షించాల్సిన మొక్కలు	- 1.76 లక్షల



సింగారంలోని నర్సరీలో ఏర్పాటు చేసిన షెడ్‌నెట్

ఎల్లారెడ్డిపేట: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. అధికారులు ఎప్పటికప్పుడు నర్సరీల్లోని మొక్కలకు నీరందిస్తూ సంరక్షిస్తున్నారు. అందులో భాగంగా ఈ వేసవిలో నర్సరీల్లో పెంచే మొక్కలకు పందిళ్లు, గ్రీన్‌నెట్‌ల సాయంతో నీడ కల్పిస్తున్నారు. తద్వారా మొక్కలు ఎండిపోకుండా ఉండే అవకాశం ఉంది. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 24 నర్సరీలుండగా ఇప్పటివరకు 18 నర్సరీలకు షెడ్ నెట్‌లను ఏర్పాటు చేశారు. ఇంకా ఆరు నర్సరీలకు పందిళ్ల ఏర్పాటు చేసేందుకు అధికారులు నిమగ్నమయ్యారు.

మొక్కల సంరక్షణ కార్యదర్శులదే..

గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే నర్సరీల్లో మొక్కల సంరక్షణ పూర్తిబాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉంది. కవర్లలో మట్టి నింపే ప్రక్రియ నుంచి మొదలు హరితహారంలో మొక్కలు అందించే వరకు పూర్తి బాధ్యత వారిదే. నర్సరీల్లో పెంచే మొక్కలకు వేసవిలో నీడ కల్పించేందుకు కార్యదర్శులు ఉపాధిహామీ కూలీల సహకారంతో చలువ పందిళ్ల అల్లి మొక్కలు ఎండిపోకుండా నీడ కల్పిస్తున్నారు. ఈ వేసవిలో ఎండల తీవ్రత కారణంగా నర్సరీల్లో గ్రీన్‌షెడ్ నెట్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. గతంలో హరిత పందిర్లను ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేయగా, ప్రస్తుతం గ్రామ పంచాయతీలకే కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. ఎండలు మరింత ముదిరితే మొక్కలు ఎండిపోకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నారు.

2.5 లక్షల మొక్కలు లక్ష్యం

మండలంలో 24 నర్సరీల ద్వారా 2.5 లక్షల మొక్కలు పెంచాలనే లక్ష్యం పెట్టుకున్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు నర్సరీలన్నింటిలో 80 శాతం వరకు 1.76 లక్షల మొక్కలు పెరుగుతున్నాయి. ప్రతిమొక్క చనిపోకుండా అధికారులు, కార్యదర్శులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 18 నర్సరీ ల్లో షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేయగా మిగిలిన నర్సరీ లకు ఈనెలలోపు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

గ్రీన్‌షెడ్‌ల ఏర్పాటు



గ్రామ పంచాయతీల సహకారంతో నర్సరీల్లో గ్రీన్‌షెడ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. నెట్‌ల కొనుగోలు బాధ్యత గ్రామపంచాయతీలకే అప్పగించాం. ఉపాధి కూలీలతో పందిర్లు వేయించాం. ఈనెల చివరివరకు మొత్తం నర్సరీల్లో నెట్‌లు ఏర్పాటు చేస్తాం.

– కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

నీడ కల్పిస్తున్నాం

వేసవిలో హరిత పందిళ్లతో మొక్కలు ఎండిపోకుండా నీడ కల్పిస్తున్నాం. లక్ష్యం ప్రకారం మొక్కలు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. గ్రీన్‌షెడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశాం. మండలంలో మిగిలిన నర్సరీల్లో నెట్‌లను గ్రామ పంచాయతీలు కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

వస్త్ర పరిశ్రమ సంక్షోభం బీఆర్‌ఎస్‌దే



మాట్లాడుతున్న చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ వల్లే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్ల బకాయిలను చెల్లించకుండా రాజకీయం చేశారని ఆరోపించారు. కార్మికులకు రావాల్సిన సబ్సిడీ యారన్ డబ్బులు కేవలం 2020 వరకే ఇవ్వడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. వస్త్రోత్పత్తిదారు తాటిపాముల దామోదర్, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు గడ్డం నర్సయ్య, గోలి వెంకటరమణ, మ్యాన ప్రసాద్, పిస్క మధు, కల్లూరి చందన, నీలి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను అప్పగించాలి



మాట్లాడుతున్న మల్లేశం

సిరిసిల్లటౌన్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితుల భూములను అక్రమంగా లాక్కొని వైకుంఠధామాలు, హరితహారం కార్యక్రమాలకు వినియోగించిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు శ్రావణపెల్లి మల్లేశం అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దళితుల భూములను కాంగ్రెస్ తిరిగి వారికే అప్పగించాలని కోరారు. ఉపాధిహామీ కూలీల వేసవి భత్యం చెల్లించాలని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సోమ నాగరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు వెలుగు చూస్తున్నాయనే ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, కుంభకోణాలు బయట పడుతున్నాయనే ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు దక్కయన్నారు. కాళేశ్వరం, ఫోన్‌ట్యాపింగ్, మద్యం, గొర్రెల స్కాంలతో బీఆర్‌ఎస్ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ వి జయం ఖాయమన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, కొండం రాజిరెడ్డి, గజ్జెలరాజు, తలారి నర్సింలు, శీలప్రశాంత్, రంజాన్‌నరేశ్, విజయ్‌రెడ్డి, భాను, రమేశ్, బాల్‌రెడ్డి, అనిల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే నాయకుడినే ఎన్నుకోవాలి

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ గారడి మాటలు.. వాగ్దానాలకు ప్రజలు మోసపోయారని, ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ఉద్దెర పథకంగా మారిందని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మొండిచెయ్యి చూపిందన్నారు. మార్పు కోరుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిస్తే పల్లెల్లో ఎండిన పొలాలే కనిపిస్తున్నాయన్నారు. ఎన్నికల్లో పనిచేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులు, ప్రజ లకు విశ్వాసం కల్పిస్తామన్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణహరి, నాయకులు గూడూరి ప్రవీణ్, సుభాశ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, రాజం, కిషన్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరు

మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, కళా కారుడు దరువు ఎల్లన్న మేనకోడలు వివాహం జరగగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మాజీటెక్స్‌టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఎంపీటీసీ సభ్యులు అనసూయ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే జరిమానా

- మండలకేంద్రంలో బోర్డుల ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ముస్తాబాద్: పట్టణంలో చెత్తవేస్తే జరిమానా తప్పదని పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ శివారులో రోడ్డు కిరువైపులా చెత్తను ఇష్టారీతిన పడేయంపై జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజలకు చెత్త, ప్లాస్టిక్ కవర్లతో ఏర్పడే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో భాస్కరశర్మ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశారు. చెత్తను పంచాయతీ ట్రాక్టర్లలో వేయాలని, బయట వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని తెలుపుతున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: రైతులను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎండిన పంటలకు పరిహారం చెల్లిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. నాయకులు రైతుల వద్దకు వెళ్లి మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. గత పదేళ్లలో ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతే ఒక్కరుపాయి కూడా చెల్లించలేదన్నారు. రైతులకు రుణమాఫీ చే యని ప్రభుత్వం కాంగ్రెస్‌పై బురదజల్లడం, అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, నాయకులు రాంరెడ్డి, హిమాం, గణపతి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌పై కేసు నమోదైంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కోనేటి రమేశ్ కుమారుడు కోనేటి అద్విత్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. జనవరి 9న అద్విత్ స్కూల్‌కు వెళ్లగా.. టీచర్ కొట్టడంతో కంటికి తీవ్ర గాయమైంది. సాయంత్రం అయ్యే వరకు తల్లిదండ్రులకు తెలియజేయకపోగా ఎలాంటి ప్రథమ చికిత్స అందించలేదు. దీనిపై తల్లిదండ్రులు నిలదీయగా వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. విద్యార్థి అద్విత్ కంటి చికిత్స కోసం సిద్దిపేట, హైదరాబాద్ ఆస్పత్రులలో చూపించారు. తమ కుమారుడిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వారు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆటోదొంగకు దేహశుద్ధి



దొంగను కట్టేసిన గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్‌లో ట్రాలీ ఆటోస్టాండ్ నుంచి ఆటోను చోరీ చేసి పరారవుతుండగా.. పట్టుకొని దేహశుద్ధి చేసిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం గాజులపల్లి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. ట్రాలీ ఆటో యజమాని గోపాల్‌నగర్‌కు చెందిన బండారి లక్ష్మణ్ తన ఆటో చోరీ అయిన విషయాన్ని ఎల్లారెడ్డిపేట పోలీసులకు సమాచారం అందించాడు. ఎల్లారెడ్డిపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ కిషన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు గాజులపల్లికి వెళ్లి తాళ్లతో బంధించిన గుర్తుతెలియని వ్యక్తిని, ఆటోను ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో కిషన్‌రావు తెలిపారు.

వరికి మొగి పురుగు.. రైతన్నలకు దిగులు

- ఉధృతంగా వ్యాపిస్తున్న తెగులు
- గత సీజన్‌లోనూ దాడి



మొగిపురుగు ఆశించిన వరిపంట

ఎల్లారెడ్డిపేట: యాసంగి సీజన్‌లో వరిలో మొగి పురుగు వ్యాపిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత సీజన్‌లోనూ మొగి పురుగు దాడితో పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఈసారి సైతం అలాంటి పరిస్థితి కనిపిస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నివారణ చర్యలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలు కనిపించడం లేదు. మొగిపురుగు ఉధృతితో చేతికొచ్చే దశలో ఉన్న పంట పూర్తిగా ధ్వంసమయ్యేలా ఉందని ఎల్లారెడ్డిపేటకు చెందిన రైతులు గుళ్లపల్లి లక్ష్మారెడ్డి, మద్దుల పద్మారెడ్డి, గూడ సిద్దిరెడ్డి, రాజిరెడ్డి, ఎల్లారెడ్డి, మద్దుల శ్రీపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, న్యాలకంటి దేవరాజు, బాలయ్యగారి గోపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బాద రమేశ్, బాయికాడి రాజయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాల్లో ఈ పురుగు ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. జింక్‌లోపం, సల్ఫైడ్ దుష్ప్రభావంతోనూ వరికి నష్టం వాటిల్లుతుంది. రైతులు పంట మార్పిడి పాటించకపోవడం, ప్రతీ సీజన్‌లో వరినే సాగుచేయడంతో తెగుళ్లు ఆశిస్తాయని పలువురు నిపుణులు తెలుపుతున్నారు.

ఫుట్‌పాత్ పగులగొట్టి నిర్మాణం



తంగళ్లపల్లి: మండలకేంద్రంలో ఓ పండ్ల వ్యాపారి ఏకంగా ఫుట్‌పాత్‌కే ఎసరుపెట్టాడు. గుట్టుచప్పుడు కాకుండా ఫుట్‌పాత్‌ను పగులగొట్టి రేకుల షెడ్డు నిర్మించేందుకు పనులు కూడా ప్రారంభించాడు. విషయం గ్రామపంచాయతీ అధికారులకు తెలియడంతో బుధవారం ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోబోయారు. కాగా సదరు పండ్ల వ్యాపారి మీరు అధికారులపై బెదిరింపులకు దిగినట్లు పలువురు వాపోయారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి వాగునుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వారిని రిమండ్‌కు తరలించారు. ఏఎస్సై కిషన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన ఆలకుంట రాజు అక్కపల్లి వాగు నుంచి కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఇసుక విక్రయించేందుకు వెళ్తుండగా వాహనాన్ని పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆలకుంట శేఖర్, డ్రైవర్ రాజుపై పాత కేసులుండడంతో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నత్తనడకన వంతెన పనులు

- ఏడాదిగా సాగుతున్న పైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



మర్రిపల్లి వద్ద నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులు

వేములవాడరూరల్: కొన్నేళ్లుగా కల్వర్టుల వద్ద వానాకాలంలో వరదనీటి నీటి ప్రవాహంతో వాహనదారులు, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గత ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా ఏడాదిగా పనులు నత్తనడకన నడుస్తున్నాయి. వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి వద్ద కోరుట్ల నుంచి వేములవాడకు వెళ్లే కల్వర్టు వద్ద ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు గత ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు రూ. 2కోట్లు మంజూరు చేయగా ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో ఆప్రాంత ప్రజలు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వర్షాకాలంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా నీటి ప్రవాహంతో రాకపోకలు కూడా నిలిచిపోయాయి. వర్షాకాలం వరకు అయినా బ్రిడ్జిపనులు పూర్తికావడం కష్టంగాగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

సంక్షిప్త వార్తలు

'టెట్' ఫీజు తగ్గించాలి

సిరిసిల్లటౌన్: ఇందిరమ్మ రాజ్యం అంటే విద్యార్థులపై పెనుభారం మోపడమేనని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు మారవేణి రంజిత్‌కుమార్ ఆరోపించారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ ఇచ్చి రూ.400 ఫీజును రూ.4వేలకు పెంచడం ఏంటన్నారు. వెంటనే పెంచిన ఫీజులు తగ్గించాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు లోపెల్లి రాజురావు, అక్షయ్, కృష్ణ, రాఘవేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును శుభ్రం చేసిన మున్సిపల్ అధికారులు

వేములవాడ: ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లే ప్రధాన సెస్ కార్యాలయం పక్కనున్న రోడ్డు డ్రైనేజీతో అపరిశుభ్రంగా మారింది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, స్థానికులు కమిషనర్ అన్వేష్ దృష్టికి తీసుకెళ్లగా బుధవారం జే ఏబీ సాయంతో రోడ్డును శుభ్రం చేయించారు. రో డుకిరువైపులా ఉన్న బండరాళ్లను తొలగించగా వాహనదారులకు రాకపోకలు సులువయ్యాయి.

ఆలయంలో పూజలు

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గరుడ ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి రథోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రుద్రంగి: మండలకేంద్రంలో రామాలయ నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గంగారాం, డీసీసీ కార్యదర్శులు తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లచ్చిరెడ్డి, పడాల గణేశ్, గంగరాజం, గంగాధర్, గంగారాం, రామాలయ కమిటీ సభ్యులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

ముస్తాబాద్: మండలకేంద్రానికి చెందిన చింతోజు బ్రహ్మచారి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దీటి నర్సింలు బుధవారం 50కిలోల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు నర్సింలు, కొండయ్య, మల్లేశం, నర్సయ్య, దేవయ్య, శంకర్, లింగయ్య, ఉపేంద్ర, చింతోజు బాలయ్య తదితరులున్నారు.

మూడోరోజు మరమ్మతు పనులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అక్కపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు మూడోరోజు బుధవారం కొనసాగాయి. సోమవారం రాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సెస్ అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించారు. గ్రామంలోని గృహాలు, వ్యవసాయ మోటార్లకు ఎల్లారెడ్డిపేట సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని, పీఆర్‌టీ వచ్చే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. వ్యవసాయ రంగానికి కేవలం మూడుగంటల విద్యుత్ మాత్రమే ఇస్తుండటంతో కోతకు వచ్చిన పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెస్ ఎస్ఈ గంగాధర్, డీఈ శ్రీనివాస్, ఏడీ ప్రదీప్, మహేందర్, ఏఈ పృథ్వీధర్ గౌడ్, సిబ్బంది లైన్ల వెంట పరిశీలించారు. రెండ్రోజుల్లో పూర్తిస్థాయిలో మరమ్మతులు జరుగుతాయని అధికారులు కోరారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com